
# మ్యాట్రిమోనియల్



– ఎస్. లక్ష్మీనారాయణ

పేపరు చూస్తున్న సుబ్బారావు మాష్టారి దృష్టి 'మాట్రిమోనియల్' కాలమ్ వద్ద ఠక్కున ఆగిపోయింది. కళ్ళద్దాలు సవరించుకొని పేపరు కాస్త దగ్గరగా పెట్టి చూసాడు 'వధువు కావలెను' అన్న ప్రకటన, అందుకు సంబంధించిన వివరాలు. 'హైద్రాబాద్‌లో ఇంజనీరుగా పనిచేస్తూ నెలకు 7 వేలకు తక్కువగాకుండా సంపాదిస్తున్న అందమైన యువకునికి, సంప్రదాయం, మంచి చదువు కలిగిన అందమైన అమ్మాయి కావలెను. కులం విషయంలో పట్టింపులేదు. వివరాలకు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి'. ఏదో ఆశారేఖ తళుక్కుమంది. ఈ సంబంధం ప్రయత్నించి చూస్తే చాలా బావుంటుంది అనుకున్నాడు. వెంటనే చిరునామా వ్రాసుకున్నాడు.

సుబ్బారావు మాష్టారుకు ఇప్పుడున్న పెద్దసమస్య కూతురు. మంచి సంబంధాల కోసం ప్రయత్నాలు చేస్తునే ఉన్నాడు ఇంకా ఆ సమస్య ఓ కొలిక్కి రాలేదు.

మాష్టారి 'మాట్రిమోనియల్' ఉత్తరానికి జవాబుగా ఉత్తరంగాక ఓ అందమైన అమ్మాయి సీతాకోకచిలుకలా మాష్టారి ఇంటిముందు వాలింది. కళ్ళజోడు సరిచేసి ఎవరబ్బా ఈ అమ్మాయి అని క్వశ్చన్‌మార్క్ ఫేస్ పెట్టాడు.

''మీరు పేపర్‌లోని మా ప్రకటనకుగాను వ్రాసిన ఉత్తరానికి బదులుగా మా అన్నయ్య నన్ను పంపించాడు మీ అమ్మాయిని చూచి రమ్మని. అందుకే వచ్చాను'' అంది.

మాష్టారి మనస్సులో ఆనందం వెల్లివిరిసింది. 'రామ్మా లోపలికొచ్చి కూర్చో' అన్నాడు. ఈరోజు ఆదివారం అమ్మాయి కూడ ఇంట్లోనే ఉంది అన్నాడు భార్య శాంతమ్మను పరిచయం చేస్తూ.

కాఫీ చప్పరిస్తున్న ఆ అమ్మాయిని 'పేరేమిటమ్మా' అన్నాడు మాష్టారు. మృదువుగా మిస్.సుజాత అంది.

''మా అమ్మాయి మాలతి బి.ఎ. వరకు చదువుకుంది. ప్రస్తుతం ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది.'' కూతురిని పరిచయం చేసాడు. 'అయామ్ వెరీ గ్లాడ్ టు సీయూ' అంది సుజాత. 'సేమ్ టు యూ' అంది మాలతి. పరిచయాలు అయ్యాక 'అమ్మాయి నాకు బాగా నచ్చింది. ఇక నచ్చాల్సిందల్లా మా అన్నయ్యే' అంది నవ్వుతూ.

ఆ మాటకు మాష్టారు పొంగిపోయారు. తన కూతురు ఓ గొప్పింటి కోడలు కాబోతుందన్న ఆశ అతని కళ్ళలో మెరిసింది.

ఇక నేను వెళ్ళొస్తానండి మీరు దయచేసి వెంటనే మా ఇంటికి రండి. ఇదుగో అడ్రసు కార్డు. అన్ని విషయాలు అక్కడే మాట్లాడుకుందాం అంది.

హైద్రాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతంలో ఆటో దిగి సుజాత ఇంటికి చేరుకున్నాడు మాష్టారు. నేరుగా మొదటి హాల్లోకి వెళ్ళాడు. తనకోసమే ఎదురు చూస్తోందా అన్నట్లు– ''ఎవరో పరాయి వాళ్ళలా హాల్లో నిల్చున్నారేమిటండి లోపలికి రండి'' అంటూ దారితీసింది సుజాత. ఆమె ఆదరణకు, ఆప్యాయతకు మురిసిపోయాడు మాష్టారు.

అందమైన క్రాపుతో, ఆకర్షణీయమైన డ్రస్సులో ఇన్‌షర్ట్ చేసి దర్జాగా నడుచుకుంటూ వచ్చిన ఆ అబ్బాయిని చూశాడు. అతడు దగ్గరిగా వచ్చి నమస్కారమండి అన్నాడు. సుజాత పరిచయం చేసింది ''ఇతనే మా అన్నయ్య'' అంటూ.

మాష్టారు తనగురించి ఉన్నదున్నట్లు చెప్పాడు. కట్నం తన తాహతు మించి ఇవ్వలేనని చెప్పాడు. ''సరే అమ్మాయి చాల అందంగా ఉందని సుజాత రికమెండు చేసింది కాబట్టి కట్నం విషయంలో అంతగా పట్టింపులేదు'' అన్నాడు శేఖరు. సుజాత కూల్‌డ్రింక్స్ తెచ్చి ముందు పెట్టింది. ''వచ్చే ఆదివారం మేము మీ ఇంటికి వస్తాము. ముహూర్తాలు, అన్ని విషయాలు కూడ అక్కడే మాట్లాడుకోవచ్చు'' అంది సుజాత.

అనుకున్నట్టుగానే ఆరోజు సుజాతవాళ్ళు మాష్టారి ఇంటికి వచ్చారు. ఆ సందడిలో మాష్టారు మహా హుషారుగా తిరుగుతున్నాడు. బ్రాహ్మణుడు నెల రోజుల తర్వాత ఓ సుముహూర్తాన్ని లగ్నంగా నిర్ణయించాడు. అంతా అందుకు ఒప్పుకున్నారు. తతంగం పూర్తి అయిపోయింది. అతని మనస్సు దూదిపింజలా అయిపోయింది. తన కూతురు పెద్దింటి కోడలయి తన కోర్కె నెరవేరబోతుందని ఎంతో ఆనందించాడు.

• • •

ఆరోజు దినపత్రిక చూస్తున్న మాష్టారి చూపు మధ్యపేజీలోనే ఆగిపోయింది. అందులో ఓ యువకుడి ఫోటో వేశారు. దాని క్రింద వివరాలు ఇలా ఉన్నాయి. 'విద్యావంతుడయిన ఈ యువకుడు ఒక మోసగత్తెతో కలిసి 'వధువుకావలెను' అన్న పేపరు ప్రకటన ద్వారా ఎంతోమందిని మోసగించి, ఎందరో కన్నెపిల్లల జీవితాలతో ఆడుకుంటూ పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్నాడు. పేపర్లలో ప్రకటనల ద్వారా పెళ్ళి సంబంధాలు కుదుర్చుకుని, ఆధునికమైన ఇల్లు అద్దెకు తీసుకుని పెళ్ళి చేసుకుంటూ అమ్మాయిలతో సహా పరారి అవుతున్న ఈ ముఠా ఢిల్లీ, మద్రాసు, బొంబాయి, హైద్రాబాద్‌లాంటి పెద్ద పెద్ద నగరాల్లో ఎన్నో మోసాలు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. చివరకు పాపంపండి పోలీసుల చేతిలో పట్టుబడ్డారు' ఇవీ ఆ వార్త వివరాలు.

ఫోటోవంక పరీక్షగా చూశాడు మాష్టారు. ఆయన కళ్ళు బైర్లు కమ్మాయి. మెదడు మొద్దుబారిపోయింది. సందేహంలేదు ఆ ఫోటోలో ఉంది శేఖర్.

మాష్టారు తల బరువెక్కిపోయింది. మనస్సంతా చిందరవందరయిపోయింది.

ఆరోజంతా మాష్టారికి అన్నం సహించలేదు. ఎంత అందంగా, అమాయకంగా తన్ను మోసగించారు. ఇలా మోసంచేసే నిత్య పెళ్ళికొడుకులు ఎందరో? వారి విషవలయాల్లో చిక్కిన అభాగ్యులు మరెందరో?

ఆ నీచుడు తనను నమ్మించి మోసం చేశాడు కానీ కూతురు పెళ్ళయి దాని జీవితం నాశనమయి ఉంటే తనకి నిష్కృతి ఉండేనా? ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామికి భక్తితో మనస్ఫూర్తిగా దండం పెట్టుకున్నాడు తన కూతురు బ్రతుకు బండలు కాకుండా కాపాడినందుకు. ★